సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం । 2 । జనవరి । 2023

పావురాలంటే ప్రాణం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా
రాక్ క్లైంబింగ్ చేసిన యువత

కోటలో పర్యాటకుల సందడి

6, 7 తేదీల్లో వర్సిటీస్ ఎంప్లాయీస్ రాష్ట్ర మహాసభలు

- 10లో▸



'కాళేశ్వరం' మోటార్లు రెడీ!
కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీపంప్‌హౌస్‌లో ఆరు మోటార్లు, అన్నారం పంప్‌హౌస్‌లో నాలుగు మోటార్లు నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధమయ్యాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0°/19.0°

వాతావరణం
ఉదయం నుంచి తేమతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమైనా మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి పూట చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఒకే పేజీలో క్యాలెండర్



విద్యారణ్యపురి: ఒక ఇయర్ క్యాలెండర్ సాధారణంగా నెలకు ఒకపేజీ చొప్పున 12పేజీలో రూపొందిస్తారు. కొన్నిరకాల క్యాలెండర్లు పేజీకి రెండువైపుల ఆరుపేజీల్లో రూపొందిస్తారు. అయితే హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కె.సత్యప్రకాశ్‌రావు, ఆయన కూతురు కె.లాస్య కలిసి ఒకే పేజీలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను(తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వేర్వేరుగా) రూపొందించారు. 12 నెలల సమాచారమంతా ఒక పేజీలోనే పొందుపరిచారు. ఆ క్యాలెండర్‌ను ఆదివారం న్యూ ఇయర్ రోజున కలెక్టర్ రాజీవ్ గాంధీహనుమంతు, అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆవిష్కరించి.. సత్యప్రకాశ్‌రావు, లాస్యను అభినందించారు.

7న జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పరీక్ష

విద్యారణ్యపురి: జిల్లా విద్యాశాఖ, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక హనుమకొండ జిల్లాశాఖ సంయుక్తంగా ఈనెల 7న పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సోషల్‌స్టడీస్ ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్గిరెడ్డి మధుసూదన్ రెడ్డి, వడ్డెపల్లి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ సోషల్ స్టడీస్ సిలబస్ నుంచి బహుఐచ్ఛిక ప్రశ్నల విధానంలో ఈనెల 4న పాఠశాల స్థాయిలో పరీక్ష నిర్వహించి అందులో విజేతలకు 7న జిల్లాస్థాయి పరీక్షను రామారంలోని స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులను ఈనెల 19న జరిగే రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ ప్రతిభా పాటవ పరీక్షలో అన్నిరకాల యాజమాన్య పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్‌స్కూల్స్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9849834110, 9440146460 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శౌర్య దివస్



హన్మకొండ: హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శౌర్య దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ 1818 సంవత్సరం జనవరి 1న భీంకోరేగావ్‌లో బ్రాహ్మణులు–మహర్లకు మధ్య యుద్ధం జరగ్గా.. మహర్లు విజయం సాధించారని, ఆ రోజును శౌర్య దివస్‌గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సలహాదారు రౌతు రమేష్‌కుమార్, సంఘాల నాయకులు బక్క దానయ్య, రవీందర్, బొమ్మల అంబేడ్కర్, యాడల రవీందర్, జగపతి, కొమ్ముల సురేందర్, గుమ్మడి ప్రవీణ్ కుమార్,బంగారు బాబు, రాజలింగం, ఇమ్మడి కొమురయ్య పాల్గొన్నారు.

ఈఎంఆర్‌ఐలో ఉద్యోగ నియామకాలు

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలో మొబైల్ వెటర్నిటీ క్లినిక్ డాక్టర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నిటీ సైన్స్ ఇన్ ఎనిమల్ హస్బెండరీలో ఉత్తీర్ణులై.. ఏడాది అనుభవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలోనైనా పనిచేయడానికి ఆసక్తి ఉన్నవారు మరింత సమాచారం కోసం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు జీవీకే ఈఎంఆర్‌ఐ కార్యాలయంలో లేదా 91339 39533, 70931 97609 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ అనిస్ ఉర్ రషీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాతపూర్వకంగా అందించిన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ వేదిక అని గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేయిస్తంభాల ఆలయ ఆవరణలో క్యూకట్టిన భక్తులు (ఇన్‌సెట్‌లో) శివుడికి పుష్పార్చన



భద్రకాళి దేవాలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తజనం (ఇన్‌సెట్‌లో) అమ్మవారు



పోటెత్తిన భక్తజనం

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలు ఆదివారం భక్తులతో పోటెత్తాయి. హనుమకొండలోని వేయిస్తంభాల గుడి, వరంగల్‌లోని భద్రకాళి దేవి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీరుద్రేశ్వరస్వామి వారికి గంగు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో 10 రకాల పూలతో మహాపుష్పార్చన నిర్వహించారు. భద్రకాళి ఆలయంలో ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో పూజలు జరగ్గా.. ఎమ్మెల్యే, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్–రేవతి దంపతులు, మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, వ్యాపారులు, నగరప్రముఖులు దర్శించుకున్నారు. భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయాల పరిసరాలు కిక్కిరిసి పోయాయి. ఇందుకు తగినట్టుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

- హన్మకొండ కల్చరల్

ఇంధన దోపిడీ!

వెహికిల్ ట్రాకింగ్ సిస్టం ఉన్నా లేనట్లే..
- అడ్డదారిలో ఆదాయ వనరుగా కూపన్ల జారీ
- నెలకు రూ.15 లక్షల సొమ్ము జేబుల్లోకి..
- చూసీ చూడనట్లుగా పాలకవర్గ పెద్దలు, కమిషనర్



వరంగల్ అర్బన్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి 1500 వాహనాల్లో వందశాతం చెత్త గమ్యస్థానాలకు చేరుతోంది. అక్కడ ఈజీఆర్‌ఎస్ వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్ పారదర్శకంగా పని చేస్తోంది. వరంగల్‌లో ఆ విధానాన్ని పటిష్టంగా అమలు చేయనున్నట్లు మేయర్, కమిషనర్లు నెలక్రితం ప్రకటించారు. నెల గడిచినా ఆఊసే కరువైంది. వరంగల్ నగరంలో 539 వాహనాలున్నాయి. అవి ఏరోజు ఎక్కడ తిరుగుతున్నాయో తెలియట్లేదు. వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్(వీటీఎస్) అద్దెకు తీసుకొని వాహనాలకు అమర్చారు. అవి పని చేస్తున్నాయా? లేదా పట్టించుకోవట్లేదు. వాహనం తిరగక పోయినా, తిరిగినట్లు రికార్డుల్లో చూపుతూ.. ఖజానాకు తూట్లు పొడుస్తున్నారు.

కూపన్ల కేటాయింపులో అవినీతి..
స్వీపింగ్ యంత్రాలు, కాంప్యాక్టర్లు, ఇటాచీ, జేసీబీలు, డోజర్లు, డంపర్ ప్లేసర్లు, ట్రాక్టర్లకు డీజిల్ కూపన్ల కేటాయింపులో అవినీతి జరుగుతోంది. పర్యవేక్షణ సిబ్బంది నుంచి వింగ్ అధికారుల వరకు ఇంధన సొమ్మును వారంతపు వాటాలుగా వేలాది రూపాయలు జేబులు నింపుకుంటున్నారు. అవినీతి, అక్రమాలకు చిరునామాగా మారిన మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ)లో ఇంధనం స్వాహా అవుతోంది. దీంతో వాహనాల డీజిల్ పక్కదారి పడుతోంది. బల్దియాకు ప్రత్యేక ఇంధన బంకు ఉన్నా లేనట్టెంది. ఇంధనం పేరుతో నెల నెలా రూ.15 లక్షల వరకు స్వాహా అవుతున్నాయి.

ఆలోచన ఉన్నా.. ఆచరణ శూన్యం
గ్రేటర్ వరంగల్ ఆలోచన గొప్పగా ఉన్నప్పటికీ ఆచరణ మాత్రం కనిపించట్లేదు. 2016లో బల్దియా వాహనాలకు వెహికిల్ ట్రాకింగ్ సిస్టం, ఆర్‌ఎఫ్‌ఐడీ వంటి ఆధునిక పరికరాలను అమర్చారు. కొద్దిరోజులకే ఆర్‌ఎఫ్ఐడీ మూలకు చేరింది. ఆరేళ్లుగా ప్రైవేట్ ఏజెన్సీలకు వాహనాల పని తీరు పర్యవేక్షణను అప్పగించి వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్(వీటీఎస్)కు అద్దె చెల్లిస్తున్నారు. ప్రస్తుతం బల్దియాలో 539 వాహనాలుండగా.. 300 వాహనాలకు మాత్రమే వీటీఎస్ ఉంది. అందుకు ఒక్కో వాహనానికి నెలకు రూ.400 చొప్పున రూ.1.20 లక్షలు చెల్లిస్తున్నారు. మిగిలిన 239 వాహనాలకు వీటీఎస్ లేదు. నిధుల దుబారా అరికట్టే యత్నం నీరుగారుతోంది.

లెక్కాపత్రం లేకుండానే..
బల్దియా డీజిల్, పెట్రోల్ వ్యయం నెలకు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు అవుతోంది. ఇంజనీరింగ్, ప్రజారోగ్య, ఉద్యానవన, అర్బన్ మలేరియా విభాగాల్లో విచ్చలవిడిగా డీజిల్‌ను వాడుతున్నట్లు రికార్డుల్లో ఉంది. వెహికిల్ ట్రాకింగ్ సిస్టం ద్వారా ఏ వాహనం ఎక్కడ తిరుగుతోంది. ట్రిప్పులు, కిలోమీటర్లు, ఖర్చయిన ఇంధనంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. కానీ ఏర్పాటు చేసిన కొద్ది నెలలకే ఈవిధానం మూలన పడి వాహనాలు గాడి తప్పాయి. వెహికిల్ ట్రాకింగ్ సిస్టం కొన్నింటికి పెట్టకపోయినా రీడింగ్‌తో పనిలేకుండా కాకి లెక్కలు చూపుతూ డీజిల్ కేటాయిస్తున్నారు. వీటికి సంబంధించి లెక్కా పత్రాలు సరిగ్గా లేవు. చెత్త తరలింపు సక్రమంగా లేక నగరంలో రోజూ 80 మెట్రిక్ టన్నులు పేరుకుపోతోంది. స్వచ్ఛభారత్‌లో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో భాగంగా దేశంలోని అన్ని నగరాలు వెహికిల్ ట్రాకింగ్ సిస్టంను అమలు చేస్తూ ఫలితాలను రాబట్టుకుంటున్నాయి. కానీ బల్దియా మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది.

రూ.లక్షలు తిని లక్షణంగా వదిలేశారు!

బల్దియా వాహనాల డీజిల్ పేరిట రెండు నెలల క్రితం రూ.53 లక్షల కుంభకోణం డిప్యూటీ కమిషనర్ విచారణలో వెలుగు చూసింది. అక్రమాలపై సవివరంగా నివేదిక కమిషనర్ ప్రావీణ్య చేతికి చేరింది. నామమాత్రంగా ఓ జవాన్‌ను అంతర్గత బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. డీజిల్ కుంభకోణంలో ఏ అధికారి, ఉద్యోగి పాత్ర ఎంత మేరకు ఉందనే అంశంలోకి వెళ్లలేదు. ఈడీజిల్ కుంభకోణంలో ఒక్క జవాన్ కాదు.. కొందరు సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సానిటరీ సూపర్‌వైజర్లు, ప్రజారోగ్యం అధికారులు, ఇంజనీర్ల పాత్ర ఉన్నట్లు స్పష్టంగా తేలింది. దోషులను వదిలేశారు. డీజిల్‌ను ఆదాయ వనరుగా మార్చుకొని అందినకాడికి నిధులను దిగమింగుతున్నారు. పాలక వర్గం పెద్దలు, కమిషనర్ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రజాధనం నీళ్లలా ఖర్చవుతుండగా, అవినీతి సిబ్బంది, అధికారుల జేబులు నిండుతున్నాయి.

అభివృద్ధిలో అగ్రభాగాన నిలపాలి



కలెక్టర్‌కు పూలమొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



సీపీ రంగనాథ్‌ను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీఓ నాయకులు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- న్యూఇయర్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: నూతన సంవత్సరంలో అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి కేంద్రీకరించి, జిల్లాను అగ్రభాగాన నిలపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. జిల్లా అధికారులు ఆదివారం కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఏడాదిలో జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కరోనా వైరస్‌పై అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కోవిడ్ నివారణ వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. అనంతరం వైద్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ రాము, సీపీఓ సత్యనారాయణరెడ్డి, మెప్మా పీడీ భద్రు నాయక్, డీపీఓ జగదీశ్, డీఈఓ అబ్దుల్‌హై, టీజీఓ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ట్రెసా అధ్యక్షుడు గణిపాక రాజ్‌కుమార్, టీఎన్జీఓ అధ్యక్షుడు రాజేందర్, మహ్మద్ రియాజుద్దీన్, జగన్మోహన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ తన చాంబర్‌లో నూతన సంవత్సరం–2023 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్, తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకం కలగాలి : సీపీ
కాజీపేట: సామాన్య ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు వస్తే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా అధికారులు వ్యవహరించాలని సీపీ డాక్టర్ ఏవీ.రంగనాథ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో డీసీపీ అశోక్‌కుమార్, వెంకటలక్ష్మి, అడిషనల్ డీసీపీలు పుష్పారెడ్డి, వైభవ్ గైక్వాడ్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'నూతన' సంబరాలు



వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ గోపి, ఇతర అధికారులు

కరీమాబాద్: నూతన సంవత్సర వేడుకలను ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ గోపి కేక్ కట్ చేశారు. వేడుకల్లో భాగంగా అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, పరిపాలనాధికారి శ్రీకాంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు కలెక్టర్‌కు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, సిబ్బంది, వివిధ సంఘాల బాధ్యులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోపి మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో జిల్లాను మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కూడా కలిసిన కలెక్టర్ గోపి శుభాకాంక్షలు తెలిపారు.



రూ.12 కోట్లు తాగేశారు

- న్యూఇయర్ వేడుకల్లో మందుబాబుల జోష్



కాజీపేట అర్బన్: న్యూఇయర్ 2023 వేడుకల్లో మందుబాబుల జోష్ కొనసాగింది. నూతన సంవత్సరం సంబరాల సందర్భంగా ఎక్సైజ్‌శాఖ 2022 డిసెంబర్ 31న వైన్స్ అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్లు తెల్లవారుజాము ఒంటి గంట వరకు విక్రయాలు కొనసాగించాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 125 బార్లు, 206 వైన్స్ ఉండగా.. గతేడాది డిసెంబర్ 31 వేడుకల సందర్భంగా రూ.9 కోట్ల విలువైన మద్యం విక్రయించగా.. 2022 డిసెంబర్ 31న రూ.12 కోట్ల విలువైన మందు అమ్మకం జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. న్యూఇయర్ వేడుకలతో ఎక్సైజ్ శాఖ ద్వారా ఖజానాకు గతేడాది కంటే రూ.3 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది.


గగన 'కోట'


చారిత్రక వైభవానికి నిలువెత్తు సాక్ష్యం కాకతీయుల కళా రాజ్యం.. నగరంలోని ఖిలావరంగల్. ఓవైపు పచ్చని పంట పొలాలు.. మరోవైపు రెండు వరుసల్లో పేర్చినట్లు వృత్తాకారంలో నిర్మించిన పటిష్టమైన మట్టి, రాతి కోటలు.. వాటి పక్క నుంచి నల్లని తాచులా మెలికలు తిరుగుతూ కనువిందు చేస్తున్న అగర్త చెరువు.. ఏకశిల గుట్ట.. పక్కనే నీలిరంగులో మంచినీటి సరస్సు.. దట్టమైన అడవిని తలపించే ఏకశిల చిల్డ్రన్స్ పార్కు.. నల్లరాతికి జీవం పోసిన శిల్పకళా సంపద.. ఇవన్నీ కలగలిపిన చిత్రమే ఇది. ఇటీవల పర్యాటక శాఖ వారు హెలికాప్టర్ ద్వారా గగన తలం నుంచి తీశారు.

- ఖిలా వరంగల్

నేడు వైకుంఠ ఏకాదశి

వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు





ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి చేసిన ఏర్పాట్లు

హన్మకొండ కల్చరల్ : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్యోదయానికి ముందే దర్శించుకోవాలి కాబట్టి తెల్లవారుజాము 4 గంటల నుంచి భక్తులు దేవాలయాలకు చేరుకుంటారు. ఈ మేరకు హనుమకొండలోని రెవెన్యూకాలనీ రామాలయం, ఎక్సైజ్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, ఎన్‌జీఓస్ కాలనీ, అదాలత్ వెనుక వేంకటేశ్వర కాలనీల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి, రాగన్న దర్వాజ పెద్దకొవెల, చిన్నకొవెల శ్రీసీతారామచంద్రస్వామి, బ్రాహ్మణవాడ దొప్ప నర్సింహస్వామి, రెడ్డికాలనీ అభయాంజనేయస్వామి, చైతన్యపురి వేంకటేశ్వరస్వామి, కాజీపేట సిద్ధార్థనగర్ ఆంజనేయస్వామి, హంటర్‌రోడ్ న్యూశాయంపేట దోనగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి, వరంగల్‌స్టేషన్ రోడ్ గోవిందరాజస్వామి, బొమ్మలగుడి(ఆకారపు) శ్రీలక్ష్మీనర్సింహస్వామి, జేపీఎన్‌రోడ్ గీతామందిర్, ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి, రామానుజకూటమి వరదరాజస్వామి, దేశాయిపేట శ్రీవేంకటేశ్వరస్వామి, బట్టలబజార్ శ్రీబాలావేంకటేశ్వరస్వామి, పోతననగర్ శ్రీకృష్ణమందిరం, గోపాలస్వామిగుడి, శ్రీభద్రకాళి రోడ్ సింహాద్రిబాగ్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి, శివనగర్ శ్రీసీతారామచంద్రస్వామి, ఉర్సుగుట్ట శ్రీరంగనాథ స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ అపహరణ



విచారణ చేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండలం మల్కాపూర్ గ్రామ సమీపంలో మీసుగు రాజభూపతి వ్యవసాయ బావి వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లారు. రైతు రాజభూపతి, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి పోలేపల్లి రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని శనివారం సాయంత్రం ఇళ్లకు వెళ్లారు. ఆదివారం ఉదయం బావుల వద్దకు వచ్చి మోటార్లు ఆన్‌చేశారు. విద్యుత్ రాకపోవడంతో సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజ్ పోయిందనుకుని వెళ్లి చూశారు. గద్దెపై ఉండాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ కనిపించలేదు. వెంటనే ఏఈ రమేష్, సబ్‌ఇంజనీర్ వినిత్‌రెడ్డి, ఎల్‌ఐ చంద్రశేఖర్, జేఎల్‌ఎం రత్నాకర్‌కు సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



నరేశ్

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాకకు చెందిన బానోత్ నరేశ్ అనే ఆటో డ్రైవర్ అదృశ్యమైనట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు తీసుకువస్తానని డిసెంబర్ 26న రూ.లక్ష తీసుకుని నరేశ్ ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. దీంతో నరేశ్ భార్య కళ్యాణి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త కొంతకాలంగా మండికొండ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన గుగులోత్ కల్పన అనే మహిళతో ఫోన్‌లో మాట్లాడేవారని, ఆమెతోనే వెళ్లి ఉంటాడని ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేసింది. కళ్యాణి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్పూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది రాజేంద్రప్రసాద్, యాకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండకు చెందిన ఎలకంటి సుగుణమ్మ, రాకేష్ రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరిలో ఆదివారం జరిగిన విందుకు హాజరయ్యారు. తిరిగి రాత్రి ఇంటికి వెళ్తుండగా చిన్నపెండ్యాల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై స్కూటీకి కుక్క అడ్డువచ్చింది. దీంతో అదుపు తప్పి కిందపడిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

'కాళేశ్వరం' మోటార్లు రెడీ!

- ఆరింటితో రోజూ ఒక టీఎంసీ ఎత్తిపోసేందుకు ప్రణాళికలు
- లక్ష్మీలో ఆరు.. అన్నారంలో నాలుగు మోటార్లు సిద్ధం
- యాసంగికి నీరందించడమే లక్ష్యం



మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీ



లక్ష్మీ పంపుహౌస్‌లో మోటార్ల ట్రయల్ రన్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ పంపుహౌస్‌లో ఆరు మోటార్లు, పెద్దపల్లి జిల్లా అన్నారం పంపుహౌస్‌లో నాలుగు మోటార్లు నీటిని ఎత్తిపోసేందుకు రెడీ అయ్యాయి. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ యాసంగి పంటలకు నీరందించడానికి ఇంజనీరింగ్ అధికారులు ఈ మేరకు సిద్ధం చేసినట్లు తెలిసింది. 2022 డిసెంబర్ చివరినాటికి నీటిని ఎత్తిపోస్తామని ప్రభుత్వం చెప్పిన విధంగా అధికారులు ట్రయల్‌రన్ పూర్తి చేశారు.

రెండో టీఎంసీ ఆరు మోటార్లతోనే..

ప్రస్తుతం లక్ష్మీ పంపుహౌస్‌లో రెండో టీఎంసీకి సంబంధించిన 11 మోటార్లు, మూడో టీఎంసీకి చెందిన ఆరు మోటార్లు కలిసి మొత్తం 17 మోటార్లు ఉన్నాయి. వరదలతో నీట మునిగి రెండో టీఎంసీలో ఒకటి, మూడో టీఎంసీలో ఆరు మోటార్ల వరకు చెడిపోయాయి. వాటికి సంబంధించిన మరమ్మతులు ఇంకా మొదలు కాలేదని సమాచారం. కాగా, రెండో టీఎంసీలోని 1, 2, 3, 4, 5, 6 మోటార్లకు గత ఏడాది డిసెంబర్ 18 నుంచి వరుస క్రమంలో ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు పూర్తి చేసి ట్రయల్ రన్ పూర్తి చేశారు. మొత్తం ఆరు మోటార్ల ట్రయల్‌రన్ సక్సెస్ కావడంతో నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. 2019 నుంచి 2022 వరకు లక్ష్మీ పంపుహౌస్ గుండా 127 టీఎంసీల నీటిని గ్రావిటీ కాల్వ ద్వారా అన్నారం బ్యారేజీకి తరలించిన విషయం తెలిసిందే.

రెండు బ్యారేజీల్లో బ్యాక్‌వాటర్..

ఎగువన గోదావరిపై అన్నారం వద్ద నిర్మించిన సరస్వతి బ్యారేజీలో మొత్తం 66 గేట్లు మూసివేసి నీటిని నిలుపుతున్నారు. బ్యారేజీ సామర్థ్యం 10.87 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే, లక్ష్మీ బ్యారేజీలో మొత్తం 85 గేట్లకుగాను ఒక గేటు ఎత్తి 84 గేట్లను మూసివేశారు. బ్యారేజీ సామర్థ్యం 16.17 టీఎంసీలకు ప్రస్తుతం 12.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అదేవిధంగా లక్ష్మీ బ్యారేజీ బ్యాక్ వాటర్ కాళేశ్వరం వరకు 21 కిలోమీటర్ల మేర నిలుస్తుంది. అక్కడి నుంచి లక్ష్మీ పంపుహౌస్‌లో మోటార్లు ఎత్తిపోయగా అన్నారం బ్యారేజీకి గ్రావిటీ కాల్వ ద్వారా సరస్వతి బ్యారేజీకి జలాలు చేరుతాయి. అక్కడి నుంచి బ్యాక్ వాటర్ 32 కిలోమీటర్ల మేర నిలుస్తుంది. నీటిని ఎత్తిపోయడానికి లక్ష్మీ పంపుహౌస్‌లో ఆరు, పెద్దపల్లి జిల్లా అన్నారం పంపుహౌస్‌లో నాలుగు మోటార్లు రెడీగా ఉండగా లక్ష్మీ, అన్నారం పంపుహౌస్‌ల్లో మోటార్ల ద్వారా రోజుకు ఒక టీఎంసీని తరలించడానికి ఇంజనీరింగ్ అధికారులు సర్వ సిద్ధం చేశారు. రేపు లేదా ఎల్లుండి నుంచి మోటార్లు నీటిని ఎత్తిపోయనున్నాయని తెలిసింది.

ఇప్పటికీ ఆంక్షలే..

గతేడాది జూలై 14న లక్ష్మీ పంపుహౌస్‌కు భారీ వరద చేరి నీట మునిగిన విషయం తెలిసిందే. ఫోర్‌బేలోకి వరద చేరి రక్షణ గోడ కూలింది. పంపుహౌస్‌లోకి వరద చేరడంతో రెండు భారీ క్రేన్లు, ఇనుప నిచ్చెనలు, వాల్స్, ఏడు మోటార్లు చెడిపోయాయి. ఎలక్ట్రికల్ పరికరాలు, ఏసీలు, ప్యానల్ బోర్డులు నీటిలో తేలియాడాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పంపుహౌస్ ప్రాంతమంతా ఆంక్షలతో పోలీసు పహారాలో ఉంది. ఇప్పటికి అక్కడి పనులన్ని రహస్యంగానే సాగుతున్నాయి.

చేపల వేటకు వెళ్తూ..

- బైక్ అదుపుతప్పి ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



రాజబాపు (ఫైల్)

కాళేశ్వరం: చేపల వేటకు వెళ్తూ బైక్ అదుపుతప్పి పడిపోవడంతో యువకుడు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధి మజీద్‌పల్లి గ్రామానికి చెందిన పానెం రాజు, మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా అరుడ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాజబాపు(19) అన్నారం గ్రామంలో చేపల వేటకు బయలుదేరారు. ఈ క్రమంలో గ్రావిటీ కాల్వ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. రాజబాపుకు తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. రాజుకు కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఇద్దరిని మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజబాపు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాజు చికిత్స పొందుతున్నాడు. నూతన సంవత్సరం రోజు విషాదం చోటు చేసుకోవడంతో మృతుడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి మద్యం తాగి బైక్ నడపడమే కారణమని స్థానికులు పేర్కొంటున్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు



గోపాల్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

- శీతాకాలంలో రికార్డు స్థాయి విద్యుత్ వినియోగం
- మార్చి నాటికి 15,500 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనా
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తూ టీఎస్ ఎన్పీడీసీఎల్ ముందుకు సాగుతోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు, సీజీఎంలు, అధికారులు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు సీఎండీ ఎ.గోపాల్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దార్శనికత, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో వ్యవసాయానికి నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా ఆదివారంతో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు.

పెరిగిన విద్యుత్ డిమాండ్

యాసంగి ప్రారంభంలోనే విద్యుత్ డిమాండ్ 14,017 మెగావాట్లకు చేరిందని, ఈ ఏడాది మార్చి నాటికి అది 15,500 మెగావాట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నామని సీఎండీ గోపాల్‌రావు తెలిపారు. ఎంత డిమాండ్ ఉన్న అంతరాయం లేకుండా విద్యుత్ అందిస్తామనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. తొలుత ఆయన ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు, జీఎంలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

- ఐదుగురిపై కేసు



స్వాధీనం చేసుకున్న కోడి పుంజులతో పోలీసులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పలుగులలో నూతన సంవత్సరం సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో కాళేశ్వరం పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పలువురు పోలీసులను చూసి పారిపోగా, అక్కడే ఉన్న మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి ఐదు కోడి పుంజులు, రూ. 2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

వ్యక్తి కిడ్నాప్?

కాజీపేట: హనుమకొండ హంటర్ రోడ్డులోని కలవ్రీ చర్చికి ప్రార్థనల నిమిత్తం వచ్చిన వ్యక్తిని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన ఘటన నగరంలో సంచలనంగా మారింది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన సత్తారి కోటిలింగం భార్య రాజమ్మతో కలిసి కారులో చర్చికి వచ్చారు. అప్పటికే అక్కడ మకాం వేసిన గుర్తు తెలియని వ్యక్తులు కోటిలింగాన్ని అతడి కారులోనే బలవంతగా కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. బాధితుడి భార్య రాజమ్మ సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దైవ దర్శనం.. భక్తిపారవశ్యం

నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు తరలివచ్చి ఇష్టదైవాలను దర్శించుకున్నారు. ఏడాదంతా చల్లగా చూడాలని వేడుకున్నారు.

– హన్మకొండ కల్చరల్



వరంగల్ భద్రకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, ఆశీర్వాదం పొందుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ దంపతులు, మేయర్ గుండు సుధారాణి తదితరులు

బైరి నరేశ్ వ్యాఖ్యలను సమర్థించిన యువకుడి అరెస్ట్



అగ్నితేజ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కమలాపూర్: అయ్యప్ప స్వామి, హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేశ్ అరెస్ట్‌ను ఖండిస్తూ, ఆయన చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తూ సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్ట్ చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు కమలాపూర్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు. కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వివరాలు వెల్లడించారు. అయ్యప్పపై బైరి నరేశ్ చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తూ అతడి సోదరుడి కుమారుడు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామ పంచాయతీ పరిధి రాములపల్లికి చెందిన బైరి అగ్నితేజ(20) ఫేస్‌బుక్‌లో ఓ వివాదాస్పద పోస్ట్ పెట్టాడు. ఆ పోస్ట్ మరింత దుమారం రేపింది. కన్నూరుకు చెందిన జిల్లపెల్లి ఉదయ్‌కిరణ్ అలియాస్ విక్రమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగ్నితేజపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి అగ్నితేజను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై సతీష్, సిబ్బంది కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



గ్రానైట్ రాళ్లకు తాళ్లు కట్టకుండానే తరలిస్తున్న దృశ్యం

ఇలా వెళ్తే.. ఎలా?

- నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ తరలింపు
- ప్రమాదమని తెలిసి కూడా పట్టించుకోని అధికారులు

హసన్‌పర్తి: గ్రానైట్ రాళ్ల రవాణా నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. లారీల్లోకి గ్రానైట్ రాళ్లకు ఎక్కించిన తర్వాత అవి కిందపడకుండా ఉండేందుకు గొలుసులతో బంధించాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. అయితే, క్వారీ యజమానులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా, ముందు జాగ్రత్తలు పాటించకుండా భారీ రాళ్లకు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అలా తరలించడం ప్రమాదమని తెలిసి కూడా పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలు తావిస్తోంది. ముఖ్యంగా మూల మలుపులు, స్పీడ్ బ్రేకర్లు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు రాళ్లు కిందికి జారే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నిబంధనలు పాటించకపోవడంతోనే మహబూబాబాద్‌లో ఘోర ప్రమాదం జరిగి ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు.

ఉచిత న్యాయసేవలు అభినందనీయం

- వర్సిటీలకు సంబంధించిన కేసులు పరిష్కరించాలి
- హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు అకుట్ జనరల్ సెక్రటరీ లేఖ

కేయూ క్యాంపస్: పేదలకు ఉచిత న్యాయసేవలు చేరువచేసేలా 23 జిల్లాల్లో ఈ నెల 2 నుంచి న్యాయ సేవాధికార సంస్థలు ప్రారంభించడం అభినందనీయమని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి అన్నారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌కు రాసిన లేఖను ఆదివారం విడుదల చేశారు. ఈ నిర్ణయంతో పేదలకు ఉచిత న్యాయ సాయం అందుతుందన్నారు. అలాగే, యూనివర్సిటీలకు సంబంధించిన కేసులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంటున్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని లేఖలో కోరారు. విద్యా వ్యవస్థలో అనర్హులను అందలం ఎక్కించడం వంటి చర్యలతో బాధితులు కోర్టులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఉద్యోగులు రిటైర్డ్ అయ్యాక కూడా కేసులు పరిష్కారం కాకపోవడంతో బాధితులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కొన్నిసార్లు జడ్జిమెంట్ నెలలు రిజర్వ్ కావడం వల్ల తప్పుచేసిన వారు తప్పించుకునే అవకాశం కలుగుతుందన్నారు.

మృతదేహంతో రాస్తారోకో

- న్యాయం చేయాలని సుమన్ కుటుంబసభ్యుల ఆందోళన
- సీఐతో వాగ్వాదం..తోపులాట




మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

కురవి: గ్రానైట్ లారీ ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన బానోత్ సుమన్ కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కురవి శివారు సోమ్లతండా సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి ఆటోను గ్రానైట్ లారీ ఢీకొన్న విషాదకర ఘటనలో ముగ్గురు మృతి చెందిన సంగతి తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం ముగ్గురి మృతదేహాలను మహబూబాబాద్ నుంచి సొంత గ్రామమైన మంగోరిగూడెంకు తీసుకెళ్లారు. అయితే, మృతుడు బానోత్ సుమన్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయలేదనే కారణంతో మృతదేహాన్ని ట్రాలీ ఆటోలో సంఘటనా స్థలానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి మృతుడి భార్య, తండ్రి, ముగ్గురు కుమార్తెలు, బంధువులు రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న మహబూబాబాద్ టౌన్ సీఐ సతీష్ రాస్తారోకో వద్దకు చేరుకున్నారు. ఆందోళన విరమించాలని మృతుడి కుటుంబ సభ్యులను సీఐ సతీష్ ఒప్పించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యులకు సీఐకి తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. రాస్తారోకో విరమించేది లేదని, లారీ యజమాని, గ్రానైట్ ఓనర్లు వచ్చి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు నినాదాలు చేశారు. దీంతో ఆగ్రహించిన సీఐ మృతుడి కుటంబ సభ్యులతో గొడవకు దిగారు. మృతుడి తండ్రి హర్జను నెట్టివేశారు. కిందపడిపోతున్న అతడిని మహిళలు పట్టుకున్నారు. వెంటనే తేరుకున్న హర్జ ఆగ్రహంతో సీఐ సతీష్‌తో గొడవకు దిగాడు. ఒకరి చేతులు మరొకరు పట్టుకునే స్థాయికి గొడవ చేరింది. దీంతో మహిళలు ఒక్కసారిగా సీఐపైకి గొడవ చేశారు. చేసేదేమి లేక సీఐ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కాసేపటికి కురవి ఎస్సై బి.రాము, మరికొందరు ఎస్సైలు, మరిపెడ, డోర్నకల్ సీఐలు సాగర్, వెంకటరత్నం సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను శాంతింపజేసే యత్నం చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో తొర్రూరు డీఎస్పీ రఘు చేరుకుని రోప్‌ను తెప్పించి మృతదేహాన్ని వాహనంలోకి ఎక్కించే యత్నం చేయించారు. అయినా మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించలేదు. సుమారు గంటపాటు జరిగిన ఆందోళన అనంతరం పోలీసులు మృతుడి కుటుంబ స భ్యులు, బంధువులను శాంతింపజేశారు. మృతదేహాన్ని వాహనంలో మంగోరిగూడెంకు తరలించారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

మడికొండ: మనస్తాపంతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాజీపేట మండలం కడిపికొండలో జరిగింది. మడికొండ పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన నెల్లి రాకేష్(32)కు భార్యతో వారం రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన అతడు శనివారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు ఆదివారం గమనించి మృతుడి అక్క సకెళ్ల రాజేశ్వరికి సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దివ్య తెలిపారు.

రైతు అనుమానాస్పద మృతి



రమణ (ఫైల్)

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భూవివాదంపై సదరు రైతుకు వ్యతిరేకంగా తీర్మానం చేయడం వల్లే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే, పంచాయితీ పెద్దలు ఆత్మహత్య బయటకు రాకుండా కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలిలా ఉన్నాయి. పెగడపల్లికి చెందిన చల్లా రమణ(35)ను కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దీనికితోడు భార్య కాపురానికి రాకపోవడంతో మరింత కుంగిపోయ్యాడు. రమణకు సంబంధించిన భూమిపై వివాదం నెలకొనగా ఆదివారం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే, పంచాయితీలో పెద్ద మనుషులు తనకు వ్యతిరేకంగా తీర్మానం చేశారని రమణ మిత్రుల వద్ద ప్రస్తావించి బోరున విలపించినట్లు తెలిసింది. వ్యవసాయ భూమి లేకుండా పోవడం, భార్య కాపురానికి రాకపోవడంతో మనోవేదనకు గురైన రమణ ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేయూ ఇన్‌స్పెక్టర్ దయాకర్ తెలిపారు. చల్లా రమణ మృతిపై విచారణ చేపడుతామని వివరించారు. పెద్ద మనుషులు అన్యాయంగా తీర్మానం చేసినట్లు తేలితే కేసు నమోదు చేస్తామన్నారు.